క్లుప్తంగా...

సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఆరోపించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 3న ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద 1969 ఉద్యమకారులతో మహాధర్నా చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఎస్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలన్నింటిలో తెలంగాణ ఉద్యమమే కీలకమన్నారు. రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదిన్నర ఏళ్లు గడుస్తున్నప్పటికీ నాటి ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, కె.మోహన్‌రావు, రచ్చ సుభద్రారెడ్డి, ఎ.వెంకటయ్య, కె.బాలయ్య, అరుణ పాల్గొన్నారు.

సన్మానం



అబిడ్స్: రాష్ట్రపతి అవార్డు గ్రహీత మనోజ్ ఖన్నను ఘనంగా సన్మానించారు. గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు సాయికుమార్ ఘనంగా సత్కారం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీలు మీర్జా రియాజుల్ హసన్ అఫందీ, మీర్జా రహ్మత్ బేగ్‌లతో కలిసి తలాబ్ చంచలం, పత్తర్‌గట్టీ డివిజన్లలో రూ.6.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తలాబ్ చంచలం డివిజన్‌లోని షాజహాన్ ఫంక్షన్‌హాల్, అమన్‌నగర్ బి, చాచా గ్యారేజీ, భవానీనగర్, తలాబ్‌కట్ట, నషెమన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం, పత్తర్‌గట్టి డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, సయ్యద్ సొహేల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



జియాగూడ: కేశవస్వామినగర్‌లో మ్యాన్‌హోల్ పక్కన పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మ్యాన్‌హోల్ వద్ద ఏర్పడిన గొయ్యి లోతుగా ఉండడంతో ఏమాత్రం అదుపు తప్పినా పడే అవకాశం లేకపోలేదు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మ్యాన్‌హోల్ వద్ద క్రమేన గొయ్యి పెరిగింది. శనివారం బీజేపీ గోల్కొండ జిల్లా డైరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ సందర్శించి వెంటనే చర్యలు తీసుకోవాలని జియాగూడ తాగునీటి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గతంలో నాలా ఉన్న కారణంగానే ఏర్పడి ఉండవచ్చని స్థానికులు తెలియజేస్తున్నారు. ప్రమాదపుటంచున ఉండడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో ఇన్‌స్పెక్టర్ సమావేశం

గోల్కొండ: మిలాద్–ఉన్–నబీ ర్యాలీలు ప్రశాంతంగా ముగియడం సంతోషకరమని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మిలాద్–ఉన్–నబీ శాంతి ర్యాలీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారు ఎంతో సమన్వయంతో క్రమ శిక్షణతో ర్యాలీ ముగించేలా కృషి చేశారని ఆయన అన్నారు. ఆబిద్, మిర్జా అహ్మద్ బేగ్, పరమానందం తదితరులున్నారు.



ర్యాలీలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, సౌత్ జోన్ డీసీపీ సాయి చైతన్య



ర్యాలీకి స్వాగతం పలుకుతున్న సీపీ ఆనంద్



అల్పాహారం, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేస్తున్న అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ సంజయ్ కుమార్

ప్రశాంతంగా మిలాద్–ఉన్–నబీ ర్యాలీ

దూద్‌బౌలి: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్–ఉన్–నబీ పండగ ర్యాలీని పాతబస్తీలో ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల నుంచి ర్యాలీలుగా తరలివచ్చి మధ్యాహ్నం వరకు మక్కా మసీదుకు చేరుకున్నారు. మక్కా మసీద్ వద్ద నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య స్వాగతం పలికారు. మిలాద్–ఉన్–నబీ ప్రధాన ర్యాలీని హాఫీజ్ ముజాఫర్ అలీ ఖాన్, బందే నవాజ్ తదితరులు చార్మినార్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త చెప్పిన మార్గంలో పయనిస్తే శాంతి నెలకొంటుందని..అన్నింటా విజయం సాధిస్తామని అన్నారు. చార్మినార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టీ, మదీనా, సాలార్‌జంగ్ మ్యూజియం, మీరాలం మండి, మొఘల్‌పురా వాల్టాహోటల్ గ్రౌండ్ వద్ద వర్షం కురువడంతో కాస్త ముందుగానే ముగిసింది. ఈ సందర్భంగా దారి పొడవునా ముస్లింలు జెండాలు చేతబూని నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ర్యాలీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దక్షిణ మండలం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీల సందర్భంగా పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లు, నాయకులు వేదికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్లు సున్నం రాజ్‌మోహన్, సొహేల్ ఖాద్రీ, ముజాఫర్ అలీ, సాయిల్ అక్బర్, మహ్మద్ సలీం, మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్, పలువురు మత ప్రముఖులు పాల్గొన్నారు.

ఖాద్రీ చమాన్ దర్గా నుంచి ర్యాలీ రద్దు..

చాంద్రాయణగుట్ట: మిలాద్–ఉన్–నబీ సందర్భంగా పాతబస్తీలోనే ప్రముఖంగా జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గా నుంచి సూఫీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని ఈ సారి రద్దు చేశారు. సాధారణంగా మిలాద్–ఉన్–నబీ అంటే రెండు మూడు రోజుల ముందు నుంచే ఫలక్‌నుమా నుంచి ఖాద్రీ చమాన్ వరకు పెద్ద ఎత్తున అలంకరణలు.. వందలాది వాహనాలతో ర్యాలీ ఉంటుంది. ఈసారి మాత్రం ఎలాంటి హడావిడి కనిపించలేదు. బార్కాస్, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ తదితర ప్రాంతాల నుంచి యువకులు విడతలు విడతలుగా చార్మినార్‌కు చేరుకున్నారు. హఫీజ్‌బాబానగర్, పూల్‌బాగ్ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీలకు చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్ కుమార్, చాంద్రాయణగుట్ట, కంచన్‌బాగ్, బండ్లగూడల ఇన్‌స్పెక్టర్లు గురునాథ్, శేఖర్ రెడ్డి, షాకీర్ అలీ బందోబస్తును ఏర్పాటు చేశారు.





చార్మినార్ పరిసరాల్లో కొనసాగుతున్న ర్యాలీ



యాకుత్‌పురా నుంచి ర్యాలీగా వస్తున్న ముస్లింలు

యాకుత్‌పురాలో..

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోకవర్గంలో ముస్లిం యువకులు ఎంతో ఉత్సాహంతో ఆదివారం మత పెద్దలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. తలాబ్‌కట్ట భవానీనగర్ నుంచి ముస్లిం మత పెద్ద మౌలానా హజ్రత్ నియామతుల్లా ఆధ్వర్యంలో మిలాద్–ఉన్–నబీ ర్యాలీ వోల్టా హోటల్, మొఘల్‌పురా, బీబీ బజార్ చౌరస్తా మీదుగా చార్మినార్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ముస్లిం మత పెద్దలు, మజ్లిస్ పార్టీ అమన్ నగర్ 'బి' అధ్యక్షుడు మహ్మద్ మోయినోద్దీన్ పాల్గొన్నారు.

అయోధ్య జంక్షన్ వద్ద..

నాంపల్లి: మిలాద్–ఉన్– నబీ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ముస్లిం మైనార్టీలు భారీ ర్యాలీని నిర్వహించారు. అహ్మద్‌నగర్ డివిజన్ ఫస్ట్‌లాన్సర్ బాదేషా దర్గా వద్ద ప్రారంభమైంది. మాసబ్ ట్యాంక్, మహావీర్ ఆస్పత్రి, లక్డీకాపూల్, అయోధ్య జంక్షన్, బజార్‌ఘాట్, ఏక్ మినార్ మసీదు, దారుస్సలాం, ఆగాపుర, మల్లేపల్లి, నోబుల్ టాకీస్ చౌరస్తా, రియాస్ హోటల్ చౌరస్తా మీదుగా హాకీ గ్రౌండ్ వరకు కొనసాగింది. అయోధ్య జంక్షన్ వద్ద ఎంఐఎం నేతలు అల్పాహారం, తాగునీళ్ల బాటిల్స్ పంపిణీ చేశారు. మధ్య మండలం అదనపు డీసీపీ ఆనంద్, సైఫాబాదు ఏసీపీ సంజయ్‌కుమార్, నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అభిలాష్ హాజరై వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఐఎం ఏరియా అధ్యక్షులు సయ్యద్ ఖలీమ్, పలువురు నేతలు హాజరయ్యారు.

విద్యుత్ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించాలి



నానల్‌నగర్‌లోని విద్యుత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని విద్యుత్ శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు మేడి రమేష్ కోరారు. ఆదివారం నానల్‌నగర్ చౌరస్తాలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో వివిధ క్యాడర్‌లలో సుదీర్ఘ కాలంగా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. అయితే కోర్టుల కేసుల పేరుతో యాజమాన్యం పదోన్నతుల ప్రక్రియను చేపట్టడం లేదని ఆయన అన్నారు. మెరిట్‌తో పాటు 85వ రాజ్యాంగ సవరణ ద్వారా పక్కన పెటిన క్యాచ్ అఫ్ రూల్‌ను అమలు చేయకుండా న్యాయబద్ధమైన కాన్సీ క్రేనిషత్ సీనియరిటీని పరిగణనించాలని ఆయన అన్నారు. యాజమాన్యం న్యాయబద్ధమైన తమ డిమాండ్లను ఆమోదించకపోతే ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.రవీందర్, ఆనంద్‌బాబు, నర్సింహతో పాటు రిజనల్ డివిజనల్ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యుత్ సైబర్ సిటీ రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిల్‌లకు చెందిన వారు పాల్గొన్నారు.

సంగీత కళలపట్ల మక్కువ పెంచాలి



ఆకట్టుకున్న నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి చిన్ననాటి నుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సమృద్ధి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ 7వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య సంధ్య పేరిట పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ..కూచిపూడి కళారూపాన్ని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న నృత్య గురువును అభినందించారు. ఎస్‌ఎల్‌ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ రితూష్య, అంకుర ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ప్రతిభ నారాయణ్, సంస్థ నృత్య గురువు సంగీత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ముదిరాజ్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: బడుగు బలహీనవర్గాల ప్రజలకు రాజకీయ అవకాశం కల్పించకుండా కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అలై బలై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 50 లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్ కులస్థులకు బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడం ఎంతో దారుణమన్నారు. ముదిరాజ్ కులస్థులు ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ముదిరాజ్ కులస్థుల డిమాండ్లకు తమ పార్టీ తరఫున పూర్తి మద్దతును ఇస్తున్నట్లు ప్రకటించారు. ముదిరాజ్ చైతన్య వేదిక చైర్మన్ శివ ముదిరాజ్ మాట్లాడుతూ.. జనాభా దామాష ప్రకారం..టికెట్లు కేటాయించిన పార్టీకి రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్‌ల మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యవేదిక నాయకులు రమేష్ ముదిరాజ్, రాములు ముదిరాజ్, గణేష్ ముదిరాజ్‌లతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు, ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



నానల్‌నగర్ కేంద్రీయ విద్యాలయం-2లో..

గోల్కొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్తను, వ్యర్థాలను ఏరారు. అదేవిధంగా నానల్‌నగర్‌లోని కేంద్రీయ విద్యాలయం–2లో కూడా స్వచ్ఛత కార్యక్రమాలు జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ జయరాజప్పన్, హెడ్ మాస్టర్ దినేష్‌నికార్, కోఆర్డినేటర్ వీఎస్‌ఎస్‌ప్రసాద్ పాల్గొన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జరిగిన పారిశుధ్య కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా ఆస్పత్రి సిబ్బందితో కలిసి ఆస్పత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేశారు. గుడిమల్కాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం..

అబిడ్స్: చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టెలీ కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ ఎం.అనిత ఉద్బోధించారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాంపల్లి కట్టెల మండిలోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో గార్బేజ్ ఫ్రీ ఇండియా అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనిత మాట్లాడుతూ.. ప్రతి సంస్థలో మూత్రశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తా చెదారం లేకుండా శుభ్రపరచుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతామని సూచించారు. అనంతరం టెలీ కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ సహాయ కంట్రోలర్ సీఎం.సంపర్ మాట్లాడుతూ.. మన పరిసరాలను కాకుండా చుట్టుపక్కల పరిసరాలను సంస్థల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడు రాబోయే తరం ఆరోగ్యకరంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో టెలీ కమ్యూనికేషన్ అకౌంట్ ఆఫీసర్ టి.భాను, పాఠశాల ఉపాధ్యాయులు హేమ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న అనిత



కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఉపాధ్యాయ బృందం

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

విజయనగర్‌కాలనీ: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవనాన్ని ఆస్వాదించవచ్చని ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మనుస్వామి నాదన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.రాధిక పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో ఆదివారం ఎన్‌ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఏక్ తారీఖ్ ఏక్ గంట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరోగ్యవంతమైన భారత్‌లో ఆవిష్కరించాలన్న మహాత్ముని కలలను నిజం చేసి చూపించాలని ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ బి.సంధ్య, మెడికల్ ఆఫీసర్ విజయరామారావు, సత్యనారాయణ, యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



గోల్కొండలో.. ఎమ్మెల్యే కౌసర్



గుడిమల్కాపూర్‌లో.. బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు